# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 219

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శుక్రవారం 11 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** రేపు (సెప్టెంబర్ 11) దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (UFBU) ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమ్మె వల్ల ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సేవలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

**వరుసగా 4 రోజులు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం :** సెప్టెంబర్ 11 శుక్రవారం సమ్మె జరగనుండగా, ఆ తర్వాతి రెండు రోజులు (శని, ఆదివారాలు) బ్యాంకులకు సాధారణ సెలవులు. అలాగే సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా హైదరా బాద్, విజయవాడ, బెంగళూరు, ముంబై, చెన్నై తదితర ప్రాంతాల్లో బ్యాంకులు మూత పడనున్నాయి. దీంతో వరుసగా 4 రోజుల పాటు బ్యాంకింగ్ లావాదేవీలపై ప్రభావం పడనుంది. సమ్మె నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) తమ ఖాతాదారులకు ముందస్తు ప్రకటన విడుదల చేసింది. అత్యవసర బ్యాంకింగ్ లావాదేవీలు ఉన్నవారు సమ్మె ప్రారంభం కాకముందే పూర్తి చేసుకోవాలని సూచించింది.

**భవిష్యత్ కార్యాచరణ :** డిమాండ్లు నెరవేరకపోతే సెప్టెంబర్ 28 నుంచి 3 రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని, అలాగే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని యూనియన్లు హెచ్చరించాయి. BRICS సదస్సును దృష్టిలో ఉంచుకుని సమ్మె విరమించుకోవాలని చీఫ్ లేబర్ కమిషనర్ (Central) ప్రతినిధులు కోరినప్పటికీ, 5 రోజుల పనిదినాలపై స్పష్టమైన నిర్ణయం వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదని UFBU నాయకులు స్పష్టం చేశారు.




**సమయం ప్రతినిధి:** జాతీయ గేయం 'వందేమాతరం'పై దేశవ్యాప్తంగా కొనసాగుతున్న రాజకీయ వివాదం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. వందేమాతర గేయానికి సంబంధించి కర్ణాటక ప్రభుత్వం తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక వేడుకల్లో 'వందేమాతరం' తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని ఆదేశించింది. ఈ నిర్ణయం కారణంగా దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేగే అవకాశం కనిపిస్తోంది. కాంగ్రెస్ నిర్ణయానికి అనుగుణంగా కేవలం తొలి రెండు చరణాలనే పాడుతామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గతంలోనే స్పష్టం చేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేయడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. వందేమాతరం గేయాన్ని పూర్తిగా పాడాలని కేంద్రం ఇటీవలె ఆదేశాలు జారీ చేసింది. 'వందేమాతరం' గేయానికి 'జనగణమన'తో సమాన గౌరవం కల్పించింది. ఇటీవల అధికారిక కార్యక్రమాల్లో పూర్తి 'వందేమాతరం' పాడటంపై కేంద్రం దృష్టి పెట్టింది. బీజేపీ నిర్ణయాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. ఎప్పటిలా వందేమాతరం తొలి రెండు చరణాలనే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల నిర్ణయించింది. 1937లో కాంగ్రెస్ నిర్ణయం ప్రకారం జాతీయ కార్యక్రమాల్లో తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలని నిర్ణయించారు. వందేమాతరంలోని కొన్ని చరణాల్లో హిందూ దేవతలకు సంబంధించిన ప్రస్తావనలు ఉండటం.




**సమయం ప్రతినిధి:** అమెరికాలో త్వరలో మిడ్‌టర్మ్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలని పట్టుదలతో ఉన్న అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ తాజా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈసారి చట్టసభల్లో తమకు మెజారిటీ దక్కేలా చేస్తే వయోజనులైన అమెరికన్లకు ఒక్కొక్కరికీ 5 వేల డాలర్ల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ చెల్లింపులకు ట్రంప్ డివిడెండ్ అని కూడా ఆయన పేరు పెట్టారు. 'డివిడెండ్' ఇచ్చేందుకు అధ్యక్షుడు ట్రంప్ ఓ షరతు కూడా విధించారు. ఈ డబ్బును అమెరికాలో మాత్రమే ఖర్చు పెట్టాలని స్పష్టం చేశారు. 'ఈ డబ్బును మీరు కెనడాలో ఖర్చు పెట్టకూడదు. చైనా, జర్మనీ పర్యటనలకు వెళ్లి ఖర్చు చేయకూడదు. అమెరికాలోనే ఈ డబ్బును వినియోగించాలి' అని అన్నారు. ఓటింగ్ సరళిని ప్రభావితం చేసేలా ట్రంప్ ఇలా బహిరంగంగా ఓటర్లకు డబ్బు ఆశ చూపించడం అమెరికాలో కలకలానికి దారి తీసింది. అసలు ఇది ఆచరణ సాధ్యమేనా? ఇలాంటి హామీలు ఇవ్వడం చట్టాన్ని ఉల్లంఘించడం కాదా? అనే చర్చ మొదలైంది. అమెరికాలో ప్రస్తుతం వయోజనులైన పౌరుల సంఖ్య దాదాపు 27 కోట్లు. ట్రంప్ హామీ ప్రకారం వీరందరికీ డబ్బులు చెల్లించాలంటే ఖజానాపై 1.3 ట్రిలియన్ డాలర్ల భారం పడుతుంది. అసలు ఇంత డబ్బును సమకూర్చుకోవడం ప్రభుత్వానికి ఎలా సాధ్యం అవుతుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. ట్రంప్ డివిడెండ్ అమెరికాలోనే ఖర్చు అయ్యేలా పర్యవేక్షణ సాధ్యం అవుతుందా? అని మరికొందరు ప్రశ్నించారు.




**సమయం ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ మూర్తి తెలిపారు. ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా బలపడిందని, రానున్న 24 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఈ అల్పపీడనం వాయువ్య దిశగా పయనించే అవకాశముందని వెల్లడించారు. అల్పపీడన ప్రభావంతో ఏపీలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని మూర్తి వెల్లడించారు. ముఖ్యంగా ఇవాళ (గురువారం) ఉత్తర కోస్తాలో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురవనున్నట్లు తెలిపారు. శుక్ర, శనివారాల్లోనూ ఏపీలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని మూర్తి చెప్పారు. అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉండటంతో వాతావరణ పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, సముద్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సూచించారు. మూడు రోజుల పాటు సముద్రంలోకి ఎవరూ వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని మూర్తి సూచించారు.




**సమయం ప్రతినిధి :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపైనా చర్చలు జరిగాయి.

**బీఆర్‌ఎస్ కుట్రను తిప్పికొట్టారు :** ఈ సందర్భంగా శాసనసభను సజావుగా సాగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ కుట్ర చేసిందని సీఎం రేవంత్ ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకునే వ్యూహం రూపొందించారని విమర్శించారు. అధికారం కోల్పోయినా వారు అహంకారం వీడలేదని మండిపడ్డారు. పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు తాను కనిపించినట్టు ఉన్నానని, అంత ఆక్రోశంతో వారిపై ఆయన దాడులు చేశారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులపై అనుచితంగా వ్యవహరించారని, మహిళా అధికారుల ఎదుట చొక్కాలు విప్పి ఇబ్బంది కలిగించారని మండిపడ్డారు. శాసనసభాపతినీ అత్యంత అభ్యంతరకరంగా దూషించారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ఆ పార్టీకి నష్టం చేకూర్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టి ప్రభుత్వానికి అండగా నిలిచారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి అభినందించారు.

**ప్రజలు గమనిస్తున్నారు..** ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 'మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుంది' అని హితవు పలికారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలు స్ఫూర్తిదాయకం




**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 10:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె. అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నగర మేయర్ జి. మమత, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రజక సంఘం నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి
## రాజకీయ పార్టీలు సహకరించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 10:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

సవరించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ అక్టోబర్ 7 వరకు, వాటి పరిష్కారం నవంబర్ 5 వరకు కొనసాగుతుందని, తుది ఓటరు జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించడంతో పాటు అనర్హులు, మరణించిన వారు, ద్వంద్వ పేర్లను నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ఓటర్ల పేర్లు అనవసరంగా తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.

ఓటరు జాబితాలను రాజకీయ పార్టీలు క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని కోరారు. ఈ నెల 12, 13 తేదీల్లో




నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొనేలా చూడాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో సమస్యలు ఉంటే పోలింగ్ కేంద్రాల వారీగా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

# సంపాదకీయం

## పెన్షన్ బెనిఫిట్స్ ప్రభుత్వ సొమ్ము కాదు!

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాల్లో కీలక భూమిక నిర్వహించింది తెలంగాణ ఉద్యోగ వర్గం. తెలంగాణ వస్తే మెరుగైన ఉద్యోగ జీవితం ఉంటుందని, ఆంధ్ర ఆధిపత్య వివక్షలు ఉండవని, వివిధ వర్గాలకు న్యాయబద్ధమైన సామాజిక వాటాలు ప్రత్యేక రాష్ట్రంలోనే పొందగలమని ఉద్యోగులు ఆశించారు. కానీ జరిగింది అందుకు విరుద్ధం. కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలను నిర్వీర్యం చేసింది. నెల నెలా మొదటి తారీఖున జీతాలు పొందడాన్ని కూడా ఒక డిమాండ్‌గా దిగజార్చిన దుస్థితికి నెట్టివేసింది. డీఏలు ఇవ్వకపోవడం, పీఆర్‌సీ అమలు చేయకపోవడం, పెన్షనర్ బెనిఫిట్స్‌ను పెండింగ్‌లో పెట్టడం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను పాత పెన్షన్ స్కీమ్‌గా మార్చకపోవడం, హెల్త్‌కార్డులను ఉచితంగా ఇవ్వకపోవడం... ఇంకా అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఉద్యోగులను, పెన్షనర్స్‌ను ఇబ్బందులపాలు చేసినందుకు గత ప్రభుత్వం ఫలితం అనుభవించింది. ఇప్పటి ప్రభుత్వం కూడా ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆరు డీఏలను ఇవ్వడం లేదు. పీఆర్‌సీ అమలును పట్టించుకోవడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులు తాము ఉద్యోగంలో ఉన్నప్పుడు దాచుకున్న సొమ్మును ఇవ్వడం లేదు. పైగా పెన్షనరీ బెనిఫిట్స్ ఎక్కడ నుంచి తెచ్చి ఇవ్వాలనీ, ఒక్కో ఉద్యోగికి సగటున కోటి పైనే చెల్లించాల్సి వస్తున్నదనీ, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి ఇస్తున్నామనీ ముఖ్యమంత్రి వాపోతున్నారు! ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చేది ఒక్క గ్రాట్యుటీ మాత్రమే. ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి రిటైర్ అయ్యేదాకా ఒక ఉద్యోగి తన జీతం నుంచి పైసా పైసా ప్రభుత్వం దగ్గర దాచుకున్న సొమ్మే జీపీఎఫ్, ఇన్సూరెన్స్, కమ్యూటేషన్ బెనిఫిట్స్. ఇవేమీ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే కానుకలు కావు. ఉద్యోగుల జీతం సొమ్ము వారికి ఇవ్వకుండా... 'ఎట్లా ఇచ్చేది? ఎక్కడ నుంచి అప్పులు తెచ్చేది? కోసినా ఒక్క పైసా లేదు, ఉచితాలు తీసి ఇవ్వాలా?' అని సమాజం ముందు ఉద్యోగులను బద్నాం చేయడం అన్యాయం. ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రజలను ప్రత్యర్థులుగా నిలబెట్టే ప్రయత్నం మంచిది కాదు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ము ఏమైంది? ఎటు మళ్లిస్తున్నారు? తెలంగాణ రాకముందు పెన్షనర్స్ పెండింగ్ బిల్స్ అంటూ లేకుండేది. ఒకటీ అరా డీఏలు పెండింగ్ ఉండేవి. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక, ఆరు కరువు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయి! బహుశా దేశంలో ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రం మనదేనేమో! మిగతా ఏ రాష్ట్రంలోనూ ఈ దుస్థితి లేదు. ఉద్యోగులు కూడా ప్రభుత్వ యంత్రాంగంలో భాగమే. వారు లేకుండా ప్రభుత్వ వ్యవస్థలు పనిచేయవు. ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పదవుల్లో ఒక్కరోజే ఉన్నా కూడా వారికి పెద్ద ఎత్తున జీతం, పెన్షన్ వస్తుంది. దీని మీద చర్చే ఉండది. ఉద్యోగుల లాగా వారు వారి జీతం నుంచి దాచుకునేది ఏమీ ఉండది. కానీ, ఉద్యోగులు ముప్పై నలభై ఏండ్ల పాటు పనిచేసి కూడబెట్టుకున్న సొమ్మును వారికి ఇవ్వడానికి ఇంత కాలయాపనా?! ఇంకోవైపు ప్రభుత్వ ధనమే తేరగా ఇస్తున్నట్లు ప్రచారం! ఇట్లా ఉద్యోగులను వేలెత్తి చూపే పద్ధతి ఇవ్వాళ్టిది కాదు. గత ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల నుంచీ ఇదే జరుగుతున్నది. పెన్షనర్లు దాచుకున్న సొమ్ము వారికి అందక ఈ రెండున్నరేళ్లలో డెబ్బయిమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. పిల్లల చదువులు, పిల్లల పెళ్లిళ్లు, సొంతింటి ఏర్పాట్లు, అప్పులు, అనారోగ్యాలు... ఇన్ని సమస్యల నుంచి దాచుకున్న జీపీఎఫ్, ఇన్సూరెన్స్, కమ్యూటేషన్ బెనిఫిట్స్‌తో బైటపడదామంటే ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసి ఇవ్వకపోవడం వల్ల జరిగిన ఆత్మహత్యలు అవి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యంగా ఇచ్చే డీఏ ప్రభుత్వ భిక్ష కాదు, ఉద్యోగుల హక్కు. ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్ల నుంచి డీఏ ఇవ్వడం లేదు. ప్రభుత్వం దగ్గర ఒక్క పైసా లేదు అంటూనే, అనేక బహుళ ప్రాజెక్టులను చేపడుతున్నది. గత దశాబ్దాల నుంచీ ఏ ప్రభుత్వాలూ పీఆర్సీలను సక్రమంగా అమలు చేసిన చరిత్ర లేదు. దానివల్ల వేతన సవరణ జరగడం ఆగిపోయి, కొత్త వేతనాలు అందడం లేదు. ఈ మధ్య క్యాష్‌లెస్ హెల్త్ కార్డుల విషయంలో కూడా బోర్డు ఏర్పాటు, రెఫరల్ హాస్పిటల్ లిస్ట్, కొత్త హెల్త్ కార్డులు ఇవ్వక మునుపే, ఆస్పత్రుల ఓపీ సేవలకు సంబంధించిన అంశాలను పూర్తి చేయకముందే హడావిడిగా ఇప్పటికి అయిదు నెలల నుంచి ఉద్యోగులు, పెన్షనర్స్ నుంచి ఒకటిన్నర శాతం (1.5శాతం) కట్ చేయడం దారుణం. అసలే బెనిఫిట్స్ రాక అల్లాడుతున్న పెన్షనర్ల పెన్షన్ నుంచి హెల్త్ కార్డులు రాకుండానే ఇలా కట్ చేయడం ఆపాలి. ఉద్యోగులు, పెన్షనర్లకు అప్పుబడిన ఆరు డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. పెన్షనర్స్ దాచుకున్న పెండింగ్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలి. పీఆర్‌సీని అమలు చేయాలి.

## బ్రహ్మోస్ పరిశ్రమ భూసేకరణపై రైతులతో కలెక్టర్ చర్చలు

### రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం.. మెరుగైన పరిహారం అందించేలా చర్యలు




సమయం ప్రతినిధి : దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామంలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు చేపట్టనున్న భూసేకరణపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం రైతులతో చర్చించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన నెగోసియేషన్ కమిటీ సమావేశంలో రైతులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను ఆమె తెలుసుకున్నారు. భూముల ప్రస్తుత మార్కెట్ విలువ, పరిహారం, రైతుల జీవనోపాధి, భవిష్యత్ ప్రయోజనాలపై చర్చించారు. రైతులు ప్రస్తుత మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని మెరుగైన పరిహారం ఇవ్వడంతో పాటు భూమికి బదులుగా భూమి కేటాయించాలని కోరారు. చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను ప్రత్యేకంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. బ్రహ్మోస్ ప్రాజెక్టుతో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ తెలిపారు. అదే సమయంలో భూములు కోల్పోయే రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చట్టపరమైన నిబంధనల మేరకు సాధ్యమైనంత మెరుగైన పరిహారం అందించే అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. భూసేకరణ చట్టం, రిజిస్ట్రేషన్ విలువలు, మార్కెట్ ధరలు, పరస్పర సమ్మతి ఆధారంగా లభించే పరిహారం తదితర అంశాలను రైతులకు వివరించారు. ఇది ప్రాథమిక దశ చర్చ మాత్రమేనని, అందుబాటులో ఉన్న సమాచారం, మార్కెట్ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. భూసేకరణ సర్వేలో భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, పట్టా, కబ్జా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రైతుల అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. రైతులు, ప్రజాప్రతినిధులు గ్రామస్థాయిలో మరోసారి సమావేశమై ఆచరణాత్మక ప్రతిపాదనలు అందించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, ఆర్డీవో నవీన్, శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్లు, గ్రామ సర్పంచులు, రైతులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్

### పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలి: ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎన్. ప్రేమలత

సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 12న శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జి ఎన్. ప్రేమలత తెలిపారు. గురువారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాజ్యదారుల ప్రయోజనం కోసం మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర న్యాయస్థానాల్లో ప్రత్యేక లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కక్షిదారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెండింగ్‌లో ఉన్న కేసులు, వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.



## అర్హత లేని వైద్యులతో నిర్వహిస్తున్న 7 క్లినిక్‌లు మూసివేత

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో డా. ఏ. శ్రీనివాసులు



సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్‌లో వైద్యార్హతలు లేని వ్యక్తులు నిర్వహిస్తున్న ఏడు క్లినిక్‌లను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేసి మూసివేయించారు. అర్హత లేని వారు వైద్యం చేయడంతో పాటు యాంటీబయాటిక్ ఇంజక్షన్లు, నెబ్యులైజర్లు, ఐవీ ద్రవాలు వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ఉపయోగించిన ఇంజక్షన్లను ప్లాస్టిక్ టబ్‌లు, ఖాళీ కార్టన్ పెట్టెల్లో మూతలు లేకుండా నిల్వ చేస్తున్నట్లు గుర్తించారు. హోమియోపతి, యునాని వైద్యం చదివిన కొందరు ఆలోపతి విధానంలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి విధానాల వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. ప్రథమ చికిత్స కేంద్రాలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంజక్షన్లు, ఐవీ ద్రవాలు, స్టెరాయిడ్ ఇంజక్షన్లు ఇవ్వకూడదని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కలిగిన వైద్య కేంద్రాలు సైతం బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం శాస్త్రీయంగా నిర్మూలించే సంస్థలకు అప్పగించాలని, బహిరంగ ప్రదేశాల్లో పడేయరాదని సూచించారు. తనిఖీల్లో డా. రాజు (ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి), డా. శివకాంత్ (ప్రోగ్రాం అధికారి), హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు పాల్గొన్నారు.

## ఏఐ ఫేక్ వీడియోలతో మోసాలు.. ప్రజలకు ప్రియాంక గాంధీ ఆఫీస్ హెచ్చరిక..

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఏఐ ఫేక్ వీడియోలను నమ్మి మోసపోవద్దని ఆమె ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు ప్రియాంక గాంధీ వాయిస్, ముఖంతో ఏఐ వీడియోలు సృష్టిస్తున్నారని పేర్కొంది. ప్రియాంక గాంధీ పేరుతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వైరల్ అవుతున్న ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ వీడియోలను క్లిక్ చేయవద్దని ప్రియాంక గాంధీ ఆఫీస్ విజ్ఞప్తి చేసింది. సోషల్ మీడియాలో ప్రియాంక పేరుతో అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే వెంటనే 'రిపోర్ట్' లేదా 'బ్లాక్' చేయాలని కోరింది. పెట్టుబడుల పేరిట జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలని ప్రియాంక గాంధీ ఆఫీస్ ప్రజలను హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది.

## ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా.. పురస్కారాల్లో గుర్తింపు ఏదీ?

సమయం ప్రతినిధి : రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపికలో తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుకుల విద్యా వ్యవస్థ బలోపేతానికి, ప్రతి ఏటా ఉత్తమ ఫలితాల సాధనకు అహర్నిశలు శ్రమిస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని వాపోతున్నారు. సాధారణ ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే గురుకుల ఉపాధ్యాయులు ఎక్కువ సమయం విధుల్లోనే గడుపుతున్నారని తెలిపారు. తెల్లవారుజామున ప్రారంభమయ్యే అధ్యయన సమయాల నుంచి రాత్రి విద్యార్థుల సంరక్షణ కోసం నిర్వహించే విధుల వరకు కుటుంబాలకు దూరంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ పనిచేస్తున్నా పురస్కారాల ఎంపికలో తమకు తగిన ప్రాధాన్యత దక్కకపోవడం బాధాకరమన్నారు. ఆధునిక బోధనా పద్ధతులను వినియోగిస్తూ విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. గురుకుల విద్యా వ్యవస్థకు రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకొస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల మార్గదర్శకాలను సవరించి గురుకుల ఉపాధ్యాయులకు సమాన ప్రాధాన్యత కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. అవసరమైతే ప్రత్యేక కోటా ఏర్పాటు చేయాలని కోరాయి. తమ సేవలను గుర్తించి ప్రభుత్వం తగిన గౌరవం కల్పించాలని విజ్ఞప్తి చేశాయి.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటేనే బంగారు భవిష్యత్




సమయం ప్రతినిధి : దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన ఏకరూప దుస్తులను గ్రామ సర్పంచ్ పెద్దమోని లక్ష్మీ ఆంజనేయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కల్పన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో, ఇష్టపడి చదువుకుంటేనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, బెల్టులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దమోని ఆంజనేయులు, సాయిలు, చంద్రమ్మ, హెచ్‌ఎం కల్పన, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్రాములు పాల్గొన్నారు.

## దొడ్డు బియ్యం వేలం, ధాన్యం రవాణాకు పకడ్బందీ ఏర్పాట్లు




సమయం ప్రతినిధి : చౌక ధరల దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యం వేలం ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ రేషన్ షాప్ డీలర్లను ఆదేశించారు. బుధవారం డీలర్లతో నిర్వహించిన సమావేశంలో వేలం ప్రక్రియపై సమీక్షించారు. రానున్న వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి లారీ యజమానులతోనూ సమావేశమై రవాణా ఏర్పాట్లను సమీక్షించారు. ధాన్యం తరలించే లారీలకు జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేసి, నిరంతరం పనిచేసేలా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రవాణా సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసి, అధికారులు, లారీ యజమానులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదామును గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాం వద్ద సిబ్బంది హాజరు పట్టిక, సీసీటీవీ రికార్డింగ్‌ను తనిఖీ చేసి, పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఏ. నిర్మల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లా నూతన అటవీ అధికారిగా మందాడి నవీన్‌రెడ్డి



సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లా నూతన జిల్లా అటవీ అధికారిగా మందాడి నవీన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో అటవీ సంరక్షణ, పచ్చదనం పెంపు, వన్యప్రాణుల పరిరక్షణపై చర్చించారు. 2019 ఐఎఫ్‌ఎస్ బ్యాచ్‌లో ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించిన నవీన్‌రెడ్డి గతంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌తో పాటు పలు జిల్లాల్లో సేవలందించారు. అటవీ భూముల ఆక్రమణలు, అక్రమ చెట్ల నరికివేతపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్షేత్రస్థాయిలో గస్తీని ముమ్మరం చేస్తామని తెలిపారు.





# వ్యవసాయ విద్యుత్ కోసం రైతుల ధర్నా

## 12 గంటల విద్యుత్ హామీ.. ఆరు గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదంటూ రైతుల ఆగ్రహం

వనపర్తి : వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం కదుకుంట్ల గ్రామ పెద్దగూడెం రైతులు ఆందోళనకు దిగారు. కదుకుంట్ల గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట, కదుకుంట్ల-వనపర్తి ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా, నాణ్యమైన విద్యుత్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా బోర్లు, మోటార్లు పనిచేయక పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు.గతంలో విద్యుత్ అందుబాటు తక్కువగా ఉన్న సమయంలోనూ అప్పటి లిమాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేశారని రైతులు గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ రైతులను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన నేపథ్యంలో అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో సరిపడా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు రైతులకు వివరించినట్లు తెలిపారు.అనంతరం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పడంతో రైతులు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కేమాణిక్యం, రఘు వర్ధన్ రెడ్డి, మాధవరెడ్డి,ధర్మ నాయక్, దేగ మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, లక్ష్మీకాంత్ రెడ్డి, సర్పంచ్ తిరుపతయ్య, మాజీ సర్పంచ్ హరిత బాలకృష్ణ, మాజీ సర్పంచ్ కొండయ్య, కృష్ణ నాయక్, మనీష్, గ్రామ అధ్యక్షులు వెంకటేష్ అశోక్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కులవృత్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : వి శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి



హైదరాబాద్ : పెద్దపల్లి జిల్లా రామగుండం, గోదావరిఖనిలో స్థానిక నాయకులతో కలిసి మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ గ కులవృత్తులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రైతుల నుంచి మొదలుకొని అన్ని కులవృత్తుల ఆధునీకరణకు పెద్దపీట వేసి, ఆయా వర్గాలు ఆర్థికంగా ఎదిగేలా అనేక కార్యక్రమాలు చేపట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చడం లేదని అన్నారు. గౌడలకు వైన్‌షాపుల్లో ఇస్తామన్న 25 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని అన్నారు. యాదవులకు ఇస్తామన్న ఆర్థిక సహాయాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని, ముదిరాజులను బీసీ-ఏ గ్రూపులో చేరుస్తామన్న హామీని అమలు చేయాలని, అన్ని వృత్తి కులాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు.ప్రజా సమస్యలను పక్కనపెట్టి అనవసరమైన చర్యలకు పాల్పడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని, వారి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.తెలంగాణ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందని అన్నారు. తుంగభద్ర, కృష్ణా, గోదావరి నదుల ద్వారా నీరు ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్నప్పటికీ, మహబూబ్‌నగర్ ప్రాంతంలోని రైతుల పొలాలు ఎండిపోతున్నాయన్నారు. పోతిరెడ్డిపాడు, వలిగొండ ద్వారా నీరు తరలిపోతున్నా తెలంగాణలో రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న పిల్లర్లకు మరమ్మతులు పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులు పూర్తి చేసుకుని మోటార్లు ఆన్ చేసుకుంటుంటే, తెలంగాణలో మాత్రం మోటార్లు ఆన్ చేయడం లేదు, వేలాది క్యూసెక్కుల నీరు ఆంధ్రప్రదేశ్ కు వెళ్తున్నా తెలంగాణ రైతులకు సాగునీరు అందకపోవడం బాధాకరమని అన్నారు.

## గ్రేటర్ పరిధిలో పోలీస్ నోటిఫికేషన్‌పై స్పష్టతనివ్వండి..



హైదరాబాద్ : హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని నాలుగు కమిషనరేట్ల పరిధిలో పోలీస్ ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్‌పై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో వివిధ అంశాలను లేవనెత్తిన ఆయన.... పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏళ్ల తరబడిగా అభ్యర్థులు పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న తరుణంలో అన్ని జిల్లాల్లో నోటిఫికేషన్ వచ్చినా... హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలో నోటిఫికేషన్ రాక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చిన కార్మికశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి ఉపముఖ్యమంత్రి తో చర్చించి, స్పష్టతనిస్తామని చెప్పారు.

## రమేష్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**



రాజాపూర్, సెప్టెంబర్ 10: చేన్నవెల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమేష్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. రమేష్ రెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.గురువారం రమేష్ రెడ్డి స్వగ్రామంలో ఆయన పార్థివదేహానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి కలిసి పాడె మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. రమేష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రమేష్ రెడ్డి నమ్మకమైన కాంగ్రెస్ నాయకుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని పేర్కొన్నారు. రమేష్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## రైతులు, విద్యార్థుల సమస్యలు పట్టవా?

అమరచింత : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలోని ప్రజా సమస్యలను గాలికి వదిలేసి " " ఎల్ నినోలి " ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు పడక సాగునీరు.తాగునీరు రైతులు కరెంట్ కష్టాలతో ఇబ్బంది పడుతుందోన్న పట్టించుకోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమ్యసలను చర్చించకుండా ఒకరి పై ఒకరు దుర్భాషలాడుతూ సభ గౌరవాన్ని మంట గలుపుతున్నారు.ఇదంతా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామిలను విస్మరించి ప్రజాసమస్యలను పట్టించుకోకుండా ప్రజలను తప్పు దోవ పటించడానికి కాంగ్రెస్ ఆడుతున్న నాటకం.రాష్ట్రంలో సరైన సమయానికి రైతులు వేసిన పంటలు ఎండిపోయ్నీ. రైతులు అప్పుల పాలై రైతులు ఆత్మహత్య చేసుకునే స్థాయికి రైతుల పరిస్థితి వచ్చింది.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వన్నీ చూస్తూ కూడా రైతు పంట భీమాను.రైతు బీమా, రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించలేదు.దానితో రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు.రైతులకు .విద్యార్థులకు.యువకులకు .రిటైర్డ్ ఉద్యోగస్తులకు .మహిళలు .చేతి వృత్తి వాళ్ళు పడుతున్న ఇబ్బందులను అసెంబ్లీ లో చర్చించకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాంగ్రెస్ బి ఆర్ ఎస్ పార్టీలు ఒకరి పై ఒకరు నిందలు మోపుకుంటూ



ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాబోయే కాలంలో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ పార్టీలకు సరైన సమయంలో బుద్ధి చెబుతారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మెర్వ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్స్ వీధ విష్ణు. ఉషన్న.చేనేత సహకార సంఘం కార్యదర్శి మేర్వ అనిల్.డైరెక్టర్ లు తిరుమల రఘు. ఎంకంపల్లి శ్రీను సీనియర్ బీజేపీ నాయకులు క్యామ భాస్కర్.దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డిగొల్ల శ్రీనివాసులు.విజయ్ యాదవ్.చాకలి రవి.మంగ అనిల్.ఉదయ్ సోషల్ మీడియా కొంగరీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారుల భరతం పడతాం

వనపర్తి : జిల్లాలో అవినీతి అధికారుల భరతం పట్టడమే తమ లక్ష్యమని బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు పేర్కొన్నారు.గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో వనపర్తి బీసీ హాస్టల్ వార్డెన్ అవినీతి బాగోతాన్ని సాక్ష్యాధారాలతో బయట పెట్టడంతో పాటు అడిషనల్ కలెక్టరుకు ఫిర్యాదు చేయడం జరిగిందని గుర్తు చేశారు. దీంతో విచారణ జరిపిన ఉన్నతాధికారులు హాస్టల్ వార్డెన్ మరియు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అవినీతి అధికారుల సస్పెండ్ తో బీసీ పొలిటికల్ జేఏసీ ఖాతాలో మరో విజయం నమోదయిందని తెలిపారు. గతంలో ఎంతో మంది అవినీతి అధికారుల భరతం పట్టడం జరిగిందని, బీసీ పొలిటికల్ జేఏసీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు.ప్రజలు కడుతున్న పన్నులతో వేతనాలు పొందుతూ... అవినీతికి పాల్పడుతున్న అధికారులను వెంటపడి మరీ పట్టుకుంటామని, అదే విధంగా నిజాయితీ గల అధికారులకు వెన్నంటే ఉంటూ వారికి పూర్తి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.బీసీ పొలిటికల్ జెఏసి ఫిర్యాదుతో స్పందించి అవినీతి అధికారులను సస్పెండ్ చేసిన జిల్లా ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు



## గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత

## కేసుల దర్యాప్తు, పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ డా. శబరీష్



సమయం ప్రతినిధి : మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గణేష్ మండపాల వివరాలను నమోదు చేసి, జియోట్యాగింగ్ చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాలను ముందుగానే పరిశీలించి భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలని, పక్కా ఆధారాలతో ఛార్జ్‌షీట్లు దాఖలు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయల్ 112/100 కాల్స్‌పై తక్షణమే స్పందించాలని, రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశించారు.

# ఫామ్ పాండ్‌లతో రైతులకు బహుళ ప్రయోజనాలు





**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 10:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం కోడేరు మండలం బావాయిపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ గురువారం ఆకస్మికంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. వి.బి.జి. రామ్‌జీ పథకంలో భాగంగా రైతు మహేశ్వరి పొలంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను కలెక్టర్ పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫామ్ పాండ్ నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు వాటిని వ్యవసాయ అవసరాలకు సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. నీటి నిల్వకు మాత్రమే పరిమితం కాకుండా ఫామ్ పాండ్ చుట్టూ వివిధ రకాల తీగజాతి మొక్కలు, కూరగాయలు సాగు చేసుకోవడంతో పాటు చేపల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని రైతులకు సూచించారు. రైతులు ఫామ్ పాండ్‌లను సమర్థవంతంగా వినియోగించుకొని వ్యవసాయంలో అదనపు ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.రైతు మహేశ్వరి భర్త బంగారయ్య పొలంలో 12□12 మీటర్ల పరిమాణంలో రూ.1.13 లక్షల అంచనా వ్యయంతో ఫామ్ పాండ్ నిర్మిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పనులను 15 రోజుల్లోగా పూర్తి చేస్తామని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారు లక్ష్మీకళ భర్త చంద్రయ్య నిర్మిస్తున్న ఇంటి పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామంలో మొత్తం 14 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండు ఇళ్లు రద్దు అయ్యాయని, మరో రెండు ఇళ్లు ఎల్-3 ఉన్నట్లు, మిగిలిన 10 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రెండో విడతలో భాగంగా గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సహకారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ ఎం.డి. జమీల్, సర్పంచ్ పరశురాములు, ఏపీవో, ఈసీ, ఏఈ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం రహదారి మీద రాస్తారోకోలో ప్రభుత్వంపై రైతన్న ఆగ్రహం...

నాగర్ కర్నూల్ : రేవంత్ రెడ్డి సొంత గ్రామంలో కరెంట్ కోతలకు నిరసనగా రైతులు రాస్తారోకో చేపట్టారు.నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతుల మెరుపు ధర్నాకేవలం 6 నుండి 8 గంటలు మాత్రమే కరెంట్ వస్తుందని పంటలు ఎండిపోతున్నాయని రాస్తారోకో చేశారు. ఈ మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.24 గంటల కరెంట్ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని రైతులు హెచ్చరించారు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటలు కరెంట్ ఇచ్చినప్పుడు మీరు ఎందుకు ఇవ్వడంలేదనీ ప్రశ్నించారు.మాకు రావలసిన నీళ్ళు చంద్రబాబు ఏపీకి తరలిస్తున్నాడనీ నీళ్లు కరెంట్ లేక పంటలు ఎండిపోతున్నాయనీ రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన కరెంట్ లేక మోటర్లు స్టార్టర్లు కాలిపోతున్నాయనీ నీళ్లు తెచ్చే చేతగకపోతే రాజీనామా చేయండి మేము తెచ్చుకుంటామనీ రైతన్నలు మండిపడ్డారు.

## సగరుల పట్టా స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నాలు విరమించాలి
## సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్ చందర్



సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ ఎనుగొండలో సగరులు సొంత నిధులతో కొనుగోలు చేసిన ఐదు ఎకరాల పట్టా భూమిలోని స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్ చందర్ ఆరోపించారు. 34 ఏళ్లుగా కాపాడుకుంటున్న స్థలాన్ని సగర విద్యార్థుల వసతిగృహ నిర్మాణానికే వినియోగించాలని కోరారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ దేవుడి పేరుతో స్థల వివాదాలు సృష్టించవద్దని, సగర సమాజ ఐక్యతను దెబ్బతీయవద్దని కోరారు. కార్యక్రమంలో పలువురు సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే ప్రథమ ప్రాధాన్యత
## ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా డంపింగ్ యార్డు ఏర్పాటు సరికాదు

సిద్దాపూర్ డంపింగ్ యార్డు జి.వో 641 వెంటనే రద్దు చేయాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్




షాద్ నగర్ : సిద్దాపూర్ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు కలిగించే నిర్ణయాలను ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు తీసుకెళ్లడం సరికాదన్నారు. డంపింగ్ యార్డు వల్ల సమీప ప్రాంతాల్లో దుర్వాసన, వాయు కాలుష్యం, భూగర్భ జలాల కలుషితం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జనావాసాల మధ్య పర్యావరణ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలపై మరింత భారాన్ని మోపడం అన్యాయమన్నారు. "ప్రజలకు ఇబ్బంది కలిగించే అభివృద్ధి అవసరం లేదు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యత కావాలి. సిద్దాపూర్ డంపింగ్ యార్డు విషయంలో ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి, ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలి" అని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం తెలంగాణ సమాఖ్య, నాణ్యూ జీూజ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా ఉద్యమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజల న్యాయమైన డిమాండ్ పరిష్కారం అయ్యే వరకు ప్రజల తరఫున తన వాణిని వినిపిస్తానని పేర్కొన్నారు.

## ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి : జిల్లా ఎస్పీ





వనపర్తి, సెప్టెంబర్ - 10: వనపర్తి జిల్లా ఏఆర్ పోలీస్ కార్యాలయంలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న కిరణ్, నరసింహ మద్యపాన వ్యసనానికి లోనై కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలిగిస్తున్న విషయం వారి భార్యలు, కుటుంబ సభ్యుల ద్వారా పోలీసు శాఖ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ మానవతా దృక్పథంతో స్పందించి, వారిలో సానుకూలమైన మార్పు తీసుకురావడంతో పాటు వారి కుటుంబ జీవితం సంతోషంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టి ఇందులో భాగంగా కిరణ్, నరసింహ లను హైదరాబాద్‌లోని డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించి నెల రోజుల పాటు అవసరమైన చికిత్స అందించారు. చికిత్స అనంతరం గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునితరెడ్డి, వారిని ప్రత్యేకంగా పిలిపించి ఆత్మీయంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది సంక్షేమం అనేది కేవలం వారి విధులకు మాత్రమే పరిమితం కాదని, వారి ఆరోగ్యం, కుటుంబ సంతోషం, మానసిక ప్రశాంతత, భవిష్యత్తు కూడా పోలీసు శాఖకు ముఖ్యమేనని తెలిపారు. మద్యపానం వంటి వ్యసనాలు ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా మొత్తం కుటుంబాన్ని ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. సమస్యను శిక్షతో చూడటం కంటే.. అవసరమైన సమయంలో చికిత్స, కౌన్సిలింగ్, ఆత్మీయతతో వారికి అండగా నిలిచి మంచి మార్పు తీసుకురావడమే పోలీసు శాఖ లక్ష్యం. మీరు ఇప్పటికే చికిత్స పొందారు. ఆ చికిత్స ద్వారా వచ్చిన మంచి మార్పును జీవితాంతం కొనసాగించాలి. ఇకపై మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉండి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు, భార్యా పిల్లలకు ప్రేమ, భరోసా కల్పించాలి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, తోటి సిబ్బందితో స్నేహపూర్వకంగా, మర్యాదగా వ్యవహరిస్తూ విధుల్లో క్రమశిక్షణ, బాధ్యత, అంకితభావంతో పనిచేయాలి. ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తించాలి.

**మద్యపాన వ్యసనానికి బానిసై చికిత్స అనంతరం కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ కౌన్సిలింగ్**
**మార్పు అనేది మన నుంచే ప్రారంభం కావాలి జిల్లా ఎస్పీ**
**ఎస్పీ కౌన్సిలింగ్‌తో సంతోషం వ్యక్తం చేసిన కానిస్టేబుళ్లు.. ఇకపై మార్పుతో జీవిస్తామని హామీ**

కుటుంబంలో ప్రశాంతమైన వాతావరణం ఉంటేనే విధుల్లో కూడా మరింత ఏకాగ్రతతో, సమర్థవంతంగా సేవలందించగలుగుతారని.జీవితంలో ప్రతి ఒక్కరికీ తప్పులు జరిగే అవకాశం ఉంటుంది. అయితే ఆ తప్పును గుర్తించి, దానిని సరిదిద్దుకుని మంచి మార్పు దిశగా అడుగు వేయడమే నిజమైన విజయం. గతాన్ని పక్కన పెట్టి.. ఈ రోజు నుంచే కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలి. మంచి భర్తగా, మంచి తండ్రిగా, మంచి కుటుంబ సభ్యుడిగా, బాధ్యతాయుతమైన పోలీసు ఉద్యోగిగా ముందుకు సాగాలి. మీరు ఆరోగ్యంగా, మానసికంగా ప్రశాంతంగా, కుటుంబంతో సంతోషంగా ఉండటం మీ కుటుంబానికే కాదు.. పోలీసు శాఖకు కూడా ఎంతో మేలు చేస్తుంది. మీ మంచి భవిష్యత్తుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని జిల్లా ఎస్పీ శ్రీమతి సునితరెడ్డి, భరోసా కల్పించారు. జిల్లా ఎస్పీ గారు తమపై చూపించిన ప్రత్యేక శ్రద్ధకు, తమ కుటుంబ సమస్యను అర్థం చేసుకుని చికిత్స అందించడంతో పాటు వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ ఇచ్చినందుకు ఏఆర్ కానిస్టేబుళ్లు కిరణ్, నరసింహ లు సంతోషం మరియు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఇకపై మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉంటామని, చికిత్స ద్వారా తమలో వచ్చిన మంచి మార్పును కొనసాగిస్తామని, భార్యా పిల్లలు మరియు కుటుంబ సభ్యులతో ప్రేమగా, ఆప్యాయంగా, సంతోషంగా జీవిసస్తూ తోటి ఉద్యోగులతో మర్యాదగా, స్నేహపూర్వకంగా మెలుగుతూ విధుల్లో క్రమశిక్షణ పాటిస్తామని, వారు ఎస్పీకి హామీ ఇచ్చారు.

## హస్మత్‌పేట్ పాఠశాలలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ
## మరుగుదొడ్ల అపరిశుభ్రతపై అసంతృప్తి.. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం

వేకువ సమయం సెప్టెంబర్ 10 కీసర ప్రతినిధి : హస్మత్‌పేట్: విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, పాఠశాల పారిశుద్ధ్య పరిస్థితులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ సూచించారు. హస్మత్‌పేట్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పాఠశాలలోని ఆరోగ్య, పారిశుద్ధ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.తనిఖీలో భాగంగా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఆహార నిల్వలను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ.. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కూరగాయల నాణ్యతను పరిశీలించడంతో పాటు వంటశాలను సందర్శించి ఆహారం తయారీ సమయంలో పాటిస్తున్న పరిశుభ్రత, ఆహార నాణ్యత, వంటగది నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించారు.అనంతరం పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించిన ఆయన.. మరుగుదొడ్లు సరైన స్థితిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు అధికంగా ఉపయోగించే మరుగుదొడ్లను నిరంతరం శుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య లోపాల కారణంగా అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున నిర్లక్ష్యం చేయరాదని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు.

### వైద్య శిబిరం పరిశీలన

పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని కూడా డా. ఆనంద్ పరిశీలించారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు నిర్వహిస్తున్న విద్యార్థుల ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, విద్యార్థుల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. ముఖ్యంగా నాూవీ--హీూవీ పిల్లలను గుర్తించడం, వారి వివరాల నమోదు, ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



### విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

విద్యార్థులతో మాట్లాడిన డీఎంహెచ్‌ఓ వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. పరిశుభ్రమైన వాతావరణాన్ని అలవర్చుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని, వంటశాల నుంచి మరుగుదొడ్ల వరకు ప్రతి విభాగంలో పరిశుభ్రత ప్రమాణాలను నిరంతరం పాటించాలని డా. కె. ఆనంద్ పాఠశాల సిబ్బందికి సూచించారు.





# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



**విద్యలో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం**
**మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలి**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కేటీ దొడ్డి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాత ప్రశ్న పత్రాలను పునఃశ్చరణ చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఖాన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికతో బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. గతేడాది ఫలితాలపై ఆరా తీసి ఈసారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక అత్యధిక విద్యార్థులు 500కు పైగా మార్కులు పొందాలని ఆకాంక్షించారు. త్వరలో జరగబోయే ఎస్ఎ1 పరీక్షల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటాలని సూచించారు. విద్యార్థుల దినచర్యను తెలుసుకొని వారికి విద్యాలయంలో కల్పించిన మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. వంట, స్టోర్ గదులను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కేజీబీవీకి సంబంధించిన హాజరు, ఇతర రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో ఆత్మగౌరవంతో జీవించాలి మహబూబ్‌నగర్ ఎంపీ అరుణ

మహబూబ్ నగర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ధీరవనిత, బహుజన ఆత్మగౌరవ ప్రతీక చిట్యాల (చాకలి) ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాను. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సింహంలా గర్జించిన వీరనారి చాకలి ఐలమ్మ. అన్యాయాలను ఎదిరించి, భూస్వామ్య శక్తులకు ఎదురొడ్డి నిలిచిన ఆమె ధైర్యం అసమానమైనది. తెలంగాణ చరిత్ర ఉన్నంత కాలం ఆమె పోరాట పటిమ చిరస్థాయిగా నిలిచిపోతుంది."భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం" ఐలమ్మ గారు చేసిన వీరోచిత పోరాటం కేవలం ఒక ప్రాంతానికో, ఒక కులానికో పరిమితం కాదు. సమాజంలోని పీడిత ప్రజలందరికీ, యావత్ మహిళా లోకానికి తమ హక్కుల సాధనలో ఆమె ఒక గొప్ప దిక్సూచిగా నిలిచారు. తెలంగాణ సమాజంలో ఆమె ప్రదర్శించిన ప్రతిఘటనా తత్వం నేటికీ మనందరికీ ఆదర్శనీయం. నేటి తరం మహిళలు ఐలమ్మ ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, ఆత్మగౌరవంతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో ఆమె తో పాటు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా , మేయర్ మమత , రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు



రెడ్డి , జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు కిరణ్ కుమార్ రెడ్డి , జ్యోతి , రజక సంఘం జిల్లా నాయకులు, బీజేపీ ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



**అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయం**
**వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 10 : వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., చాకలి ఐలమ్మ తెలంగాణలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలని, అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన తెగువ, పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ అన్నారు.సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాలకు సామాజిక గౌరవం, సమాన హక్కులు, అభివృద్ధి అవకాశాలు కల్పించడంలో చాకలి ఐలమ్మ వంటి మహనీయుల పోరాటాలు కీలక పాత్ర పోషించాయని కలెక్టర్ తెలిపారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని సూచించారు.చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర, ఆమె పోరాటం, సమాజం పట్ల ఆమెకున్న నిబద్ధతను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఆమె చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పట్టుదల నేటి తరానికి మార్గదర్శకంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వం బీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత వంటి రంగాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య, బీసీ సంక్షేమ సహాయ అధికారి శ్రీరాములు ,సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

## హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

వేకువ సమయం// మంచిర్యాల,సెప్టెంబర్ 10, 2026 : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ-2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ క్రమంలో మార్కింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను



సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్.ఐ.ఆర్.-2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 48వ చాతుర్మాస మహోత్సవాలలో పాల్గొన్న గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి TGSGDCFL శ్రీమతి సరిత తిరుపతయ్య

గద్వాల : ధరూర్ మండల కేంద్రంలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 15వ శతాబ్దం నాటి వ్యాసరాయల వారి కాలంలో స్వయంభూగా వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న 48వ చాతుర్మాస మహోత్సవాలలో గద్వాల్ నియోజకవర్గ ఇంచార్జి & TGSGDCFL ఛైర్పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆద్య మాధ్వాచార్యులచే ఆమెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతం, విశేష సుగంధ ద్రవ్యాలతో ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేశారు. శ్రీమతి సరిత తిరుపతయ్య వరుణ యాగంలో పాల్గొన్నారు. అనంతరం ఉడిపి పలిమార్ మఠ పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు, శ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారి దివ్య సన్నిధిలో శాస్త్రోక్తంగా జరిగిన సుదర్శన చక్ర మండల పూజలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుని దివ్యాయుధమైన సుదర్శన చక్రానికి పీఠాధిపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీమతి సరిత తిరుపతయ్యలికి పట్టు వస్త్రాలు సమర్పించి సత్కరించారు. స్వామీజీలు ఆమె వెంట వచ్చిన కార్యకర్తలకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు, మంత్రాక్షతలు, ఫలాలు పంపిణీ చేశారు. వేద పండితులు భక్తులందరికీ వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు సర్పంచ్ లు మండల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద నిల్వల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



వేకువ సమయం// మంచిర్యాల,సెప్టెంబర్ 10, 2026 : జిల్లాలోని అన్ని ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద నిలువల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఎ.సి.ఎస్.ఓ. తో కలిసి ఇన్‌చార్జీలు, డి.ఈ.ఓ.లు, స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎం.ఎల్.ఎస్. పాయింట్ల వద్ద ఉన్న నిల్వల పంపిణీ ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత ఇన్‌చార్జీలను ఆదేశించారు. స్టాక్ తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. స్టేజ్--1, స్టేజ్--2 గుత్తేదారులు అవసరానికి అనుగుణంగా తగినన్ని వాహనాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకుని, అందుబాటులో ఉన్న నిల్వలను సకాలంలో తరలించాలని ఆదేశించారు. నిల్వల తరలింపు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌స్పైర్ అవార్డ్సుకు నామినేషన్ల నమోదు

సమయం ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్లను సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి తెలిపారు.జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు నమోదు చేయాలని సూచించారు. నామినేషన్లు నమోదు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు అర్హులు.నామినేషన్‌కు విద్యార్థి బ్యాంకు ఖాతా వివరాలు, ప్రాజెక్టు రైట్‌అప్, ఆధార్, బోనఫైడ్, ఫొటో అవసరం. ఆన్‌లైన్‌లో విద్యార్థి ఫొటో, ప్రాజెక్టు రైట్‌అప్ మాత్రమే అప్‌లోడ్ చేయాలి. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎం.డి. షంషీర్‌ను 9177790051 నంబర్‌లో సంప్రదించవచ్చు.





# వయోవృద్ధులకు ఉచిత ఛాతి X-Ray పరీక్షలు...

గద్వాల: ప్రభుత్వ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ & టిబి క్షయ వ్యాధి నివారణ శాఖ వారి ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా వారి సహకారంతో సీనియర్ సిటిజన్స్ మరియు వయోవృద్ధుల కోసం ఉచిత ఛాతి X-Ray శిబిరాన్ని నిర్వహించారు.జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సెకండ్ రైల్వే గేట్ సమీపంలోని ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ నందు నిర్వహించిన ఈ శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా చైర్మన్ సంగాల అయ్యప్ప రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప రెడ్డి గారు మాట్లాడుతూ, వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా ఛాతి సంబంధిత సమస్యలు, క్షయవ్యాధి వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించేందుకు X-Ray పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. వయోవృద్ధులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో దాదాపు 30 మంది సీనియర్ సిటిజన్స్ వయోవృద్ధులకు ఉచితంగా ఛాతి X-Ray పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవల కోసం సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యనిర్వాక సభ్యులు జి.గంగాధర్ గౌడ్, మహేష్ నాయుడు వైద్య సిబ్బంది ఆర్.కిరణ్ కుమార్ ఆరోగ్య సందర్శకులు, కె.వెంకటేష్ జిల్లా కార్యక్రమ సమన్వయకర్త, పి.జయరాజు సమాజ సమీకర్త, ఎం.ఉదయ్ ఎక్స్-రే సాంకేతిక నిపుణులు పాల్గొని సేవలు అందించారు.







## పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయానికి అదనపు ఈఓగా జైపాల్ రెడ్డి

### కార్యనిర్వహణాధికారి (గ్రేడ్-III)గా అదనపు బాధ్యతల స్వీకరణ



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 10: (పాలెం) శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, పాలెం నూతన అదనపు కార్యనిర్వహణాధికారిగా శ్రీ జన్నుంపల్లి జైపాల్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యనిర్వహణాధికారి (గ్రేడ్-III)గా ఆయన అదనపు బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం, పోతులమడుగు నందు రెగ్యులర్ కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న జైపాల్ రెడ్డి, తాజాగా పాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ఆలయ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేలా తన సేవలను కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు. అదనపు బాధ్యతలు స్వీకరించిన జైపాల్ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## అయిజ సమీపంలో కారు బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

అయిజ: జోగులాంబ గద్వాల జిల్లా అయిజ సమీపంలో గురువారం ఒక కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారు అయిజ నుండి ఎమ్మిగనూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వారం రోజుల పోరుబాటను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు

– దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ: సెప్టెంబర్ 9, సమయం ప్రతినిధి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల దగా పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు చేపట్టిన "వారం రోజుల పోరుబాట" కార్యక్రమాలను విజయవంతం చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, యువత, మహిళలు మరియు ప్రజలందరికీ దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....తనపై ఉన్న గౌరవం, అభిమానంతో తమ వ్యక్తిగత పనులను సైతం పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరుబాటకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై తన పోరాటం ఎప్పటికీ ఆగదని, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ప్రజల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత బలమైన పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

## కీసర డివిజన్-1లో బీఆర్ఎస్ శ్రేణుల భారీ ధర్నా

వేకువ సమయం సెప్టెంబర్ 10 కీసర ప్రతినిధి: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కీసర డివిజన్-1లో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు భారీ ధర్నా చేపట్టారు. కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధానికి దారితీసింది. ఈ నేపథ్యంలో కీసరలో బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కి తమ నిరసనను వ్యక్తం చేశాయి.

**కేసీఆర్ అవమానాన్ని సహించం**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, ఆయనపై ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రాజకీయ విమర్శలు విధానాలు, పాలనకు పరిమితం కావాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం తగదని పేర్కొన్నారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇటీవల రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు

కీసరలో రాజకీయ వేడి

కేసీఆర్, రేవంత్‌రెడ్డి మధ్య విమర్శలు--ప్రతివిమర్శల నేపథ్యంలో కీసరలో జరిగిన ఈ ధర్నాతో స్థానికంగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



కేసీఆర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ శ్రేణులు మౌనంగా ఉండబోవని స్పష్టం చేశారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ నాయకుల స్థాయిని, తెలంగాణ ఉద్యమ చరిత్రను గౌరవించే విధంగా రాజకీయ భాష ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు, చినింగని బాలరాజ్ బీఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పీ వైస్ చైర్మన్, పూస వెంకటేష్, జిల్లా నాయకులు, నాయకపు వెంకటేష్ ముదిరాజ్, మొర రవికాంత్ ముదిరాజ్, గుర్రం శ్రీధర్ రెడ్డి, రాగుల రమేష్ ముదిరాజ్, బొడుసు రమేష్ యాదవ్, తటాకం భాను శర్మ, మెట్టు సతీష్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కీసరలో అభివృద్ధికి కాంగ్రెస్ బాట

వేకువ సమయం సెప్టెంబర్ 10 కీసర ప్రతినిధి : కీసర పట్టణ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటున్నాయని కాంగ్రెస్ కీసర డివిజన్-1 అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి అన్నారు. ప్రజలకు నిత్యావసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.గురువారం కీసరలోని శ్రీభవాని రామలింగేశ్వర కాలనీ, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. శ్రీభవాని రామలింగేశ్వర కాలనీలో మున్సిపల్ కార్పొరేషన్ నిధులు రూ.20 లక్షలు, సుభాష్‌నగర్‌లో రూ.9 లక్షల వ్యయంతో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మొత్తం రూ.29 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ పనులతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తొలగి, రహదారుల పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వప్న విజయ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గతంలో సరైన రహదారులు లేక వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కీసర డివిజన్‌లో ఇంకా



అవసరమైన ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని ఆమె వెల్లడించారు. మిగిలిన కాలనీల్లోనూ త్వరలో రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యలను స్థానికంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదే.రమేష్ గుప్తా, మాజీ ఎంపీపీ సుజాత, మాజీ ఎంపీటీసీ మచ్చాని జంగయ్య యాదవ్, కాంగ్రెస్ రైతు సంఘం అధ్యక్షుడు పినింటి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు రామిడి విజయ్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజా మొయినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 10: నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గం కోడేరు మండలం బావాయిపల్లి గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మికంగా పర్యటించి భూ రీ సర్వే పనులతో పాటు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ స్కూల్ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాల పంపిణీలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా, ఎవరికైనా విద్యార్థులకు అందలేదా అనే విషయాన్ని సైతం విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు.అదేవిధంగా గ్రామంలో బడి ఈడు ఉన్న పిల్లలందరూ పాఠశాలలో చేరేలా, క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడిని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు గ్రామ సర్పంచ్ సహాయ సహకారాలు తీసుకుని పాఠశాలను మరింత అభివృద్ధి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని, తరగతి గదులు, విద్యార్థుల హాజరు, విద్యార్థుల సంఖ్య, విద్యాబోధనకు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనుల పురోగతిని రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేలో భాగంగా భూముల హద్దులు, ప్రభుత్వ భూములు, నిరుపయోగ భూములు, వ్యవసాయ భూములు, పట్టా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలతో పూర్తిగా సరిపోల్చాలని అధికారులను ఆదేశించారు. భూ వివరాల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.ఈ పర్యటనలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ ఎం.డి. జమీల్, ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ పరశురాములు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం







**వేకువ సమయం// మంచిర్యాల,సెప్టెంబర్ 10, 2026 :** సామాజిక అన్యాయాలు, దోపిడీ, అణచివేతను ఎదురించి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, వెనుకబడిన తరగతుల శాఖ అధికారి నీరటి రాజేశ్వరి,కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పట్టుదల నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. వెట్టి చాకిరీ, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి మహిళా చైతన్యానికి, సామాజిక న్యాయానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేశ విగ్రహాలను పంపిణీ చేసి మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా జలవనరుల కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. రసాయనిక రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ గారి త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయం...
## ఆమె పోరాట పటిమను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి : ఒబేదుల్ల కొత్వాల్






మహబూబ్ నగర్:తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ గారికి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ వీరత్వాన్ని, ఆమె సాగించిన పోరాట పటిమను స్మరించుకుంటూ కొత్వాల్ ప్రసంగించారు. భూస్వామ్య వ్యవస్థకు, పెత్తందారీ విధానానికి మరియు నిజాం కాలపు అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి పోరాడిన గొప్ప నాయకురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు. సమాజంలో అన్యాయాలను ఎదురించి సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన వీరనారి ఐలమ్మ చరిత్రను నేటి యువత తప్పకుండా చదవాలని, ఆమె పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ గారి పేరు పెట్టడం ద్వారా ప్రజా సంక్షేమానికి, వారి భావజాలానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యత స్పష్టమైందని, ఈ నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి గారికి ప్రజల మరియు పార్టీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొని చాకలి ఐలమ్మ కి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా , ఎంపీ డీకే అరుణ , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ , మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ పి. రామాంజుల రెడ్డి, ఐజజ ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్ర కుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా రెడ్డి, కార్పొరేటర్ ప్రవీణ్, టౌన్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు అజ్మత్ ఆలీ,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అలాగే రజక సంఘం నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలి జిల్లా ఎస్పీ



వనపర్తి : క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఓటమిని సైతం సానుకూలంగా స్వీకరించి విజయానికి నిరంతరం కృషి చేసే మనస్తత్వాన్ని అలవర్చుతాయని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 8వ ఎడిషన్ =జీ ఇంటర్ స్కూల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్--2026లో అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించిన రెయిన్ బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులను గురువారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, అభినందించారు. క్రీడల్లో ప్రతిభను చాటుతూ పాఠశాలకు, వనపర్తి జిల్లాకు పేరు తీసుకువచ్చిన విద్యార్థులను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించి వారికి మెమెంటోలు అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. "విజయం అనేది ప్రతిభతో పాటు నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతోనే సాధ్యమవుతుంది. విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రతిరోజూ సాధన చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి వనపర్తి జిల్లాకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్పీ గారు ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్కేటింగ్ కోచ్‌లు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ విజేత విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించి వనపర్తి జిల్లాకు మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఈవీఎం గోడౌన్‌ను త్రైమాసిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



### ఎన్నికల సామాగ్రి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 10 : నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ గురువారం త్రైమాసిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తెరిచి, అక్కడ భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామాగ్రితో పాటు భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గోడౌన్ భద్రత, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, సీల్ విధానం, రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రి భద్రతకు సంబంధించి నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీ సందర్భంగా ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

అమరచింత : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, పీడిత ప్రజల ఆత్మగౌరవ ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి నీ అమరచింత లొ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 41వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ పోరాటశీ,దొరల గడీలపై తిరుగుబాటు, నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ రాజ్యమేలుతున్న రోజుల్లో విసునూరు రామచంద్రారెడ్డి లాంటి క్రూరమైన దేశ్‌ముఖ్‌కు ఎదురొడ్డి నిలిచిన ధీరవనిత. తాను కష్టపడి పండించిన పంటను గుండాలు దోచుకెళ్లకుండా ఒంటిచేత్తో అడ్డుకుని అహంకారాన్ని మట్టికరిపించింది.ఆమె భూమి రక్షణ కోసం మొదలైన ఉద్యమమే యావత్ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రధాన నిప్పురవ్వగా మారింది. 'నా భూమి.. నా పంట.. దొర ఎవడు లాక్కోవడానికి?' అంటూ ఆమె వేసిన ప్రశ్న తెలంగాణ పల్లెపల్లెనా పోరాట నినాదమైంది.మహిళా శక్తికి నిదర్శనం,పురుషాధిక్యత, గడీల అణచివేత ఎక్కువగా ఉన్న ఆ కాలంలోనే మహిళలకు నాయకత్వ లక్షణాలు, ధైర్యం మెండుగా ఉంటాయని ప్రపంచానికి చాటిచెప్పిన ఆదర్శమూర్తి.తెలంగాణ అస్తిత్వానికి చుక్కాని,స్వయంపాలన, ఆత్మగౌరవం కోసం సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి కూడా ఐలమ్మ తెగువ, పోరాట పటిమ గొప్ప నైతిక బలాన్నిచ్చాయి. ఇంతటి దీర వనిత మా కులంలో పుట్టడం మా రజక జాతికి గౌరవం ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు సుతారి శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి సవరన్న, వా వెంకటేష్, కోరి శ్రీనివాసులు, తాయికుమార్,సుతారి దేవమ్మ వెంకటేశ్వరమ్మా, మహిముద్, సూరి తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో కార్మిక చట్టాల సవరణ కు వ్యతిరేకంగా పోరాటాలు CITU



సమయం ప్రతినిధి :తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో బిజెపి తీసుకొచ్చిన కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా కార్మిక వర్గం దీర్ఘ కాలిక పోరాటాలు చేయాలని సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో నాడు ఐలమ్మ మహిళలు,రైతులపై చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా,ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న కార్మికుల దుర్భరమైన జీవితాలు అధ్యయనం చేసి ఈ విధంగా పోరాడిందో నేడు కార్మిక వర్గం బీజేపీ చేసిన కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.మహిళ అయినప్పటికీ నాడు నిర్బంధాలను, నిరంకుశ పాలనను ఎదిరించి ధైర్యంగా పోరాడిందని కొనియాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను సవరించి కనీస వేతనాలు దక్కనీయకుండా, ఉద్యోగ భద్రత లేకుండా సామాజిక భద్రత కల్పించకుండా, కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను కాల రాసిందని విమర్శించారు. కార్మిక వర్గ హక్కులను పరిరక్షించడం చేతగాని బిజెపి ప్రభుత్వం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని ఆర్‌ఎస్‌ఎస్, మత విద్వేషాలు సృష్టించి లౌకికవాదాన్ని దెబ్బతీస్తున్నదని,చరిత్ర వక్రీకరణకు పాల్పడుతున్నారని విమర్శించారు. బిజెపి తీసుకువచ్చిన కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా పోరాడటమే ఐలమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని, ఆ దిశగా కార్మిక వర్గం ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఘట్టన్న, ఐకేపీ VOA సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డ్యాం అంజి,తిమ్మప్ప భవన నిర్మాణ కార్మిక సంఘం గద్వాల మండలం అధ్యక్షుడు సీతారాం, నాయకులు శ్రీనివాస్, కార్మికులు నాగరాజు,అంజి పాల్గొన్నారు.ధన్యవాదాలతో తిమ్మప్ప CITU జిల్లా సహాయ కార్యదర్శి జోగులాంబ గద్వాల జిల్లా.

## మంత్రులపైనే కేసులు పెట్టాలి

### బీఆర్ఎస్ నేతలపై పోలీసుల తీరుకు సీఎం రేవంత్‌రెడ్డే కారణం: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల సెప్టెంబర్ 10, సమయం ప్రతినిధి : అసెంబ్లీ పరిసరాల్లో గత రెండు, మూడు రోజులుగా బీఆర్ఎస్ నేతలపై పోలీసులు వ్యవహరించిన తీరు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆరోపించారు. జడ్చర్లలో శ్వేతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్యాన్సర్ చికిత్స శిబిరం వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడాతుకేటీఆర్, హరీశ్‌రావులపై లైంగిక వేధింపుల కేసుల అంశంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీ వద్ద ఉద్దేశపూర్వకంగానే మహిళా ప్రజాప్రతినిధుల వద్ద పురుష పోలీసులను, పురుష ప్రజాప్రతినిధుల వద్ద మహిళా పోలీసులను మోహరించి వివాదానికి ప్రభుత్వం కారణమైందని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల వ్యవహారశైలి బాధాకరమన్నారు. అసెంబ్లీకి ఫలానా దుస్తులతోనే రావాలనే నిబంధన ఎక్కడా లేదని అన్నారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ నల్లదుస్తులతో నిరసన తెలిపితే తప్పు లేనప్పుడు, తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు నిరసన తెలిపేందుకు వస్తే అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉండాల్సిన సమయంలో ప్రభుత్వం ప్రజల్లో భయాందోళనలు, అభద్రతాభావాన్ని కలిగించేలా వ్యవహరిస్తోందని లక్ష్మారెడ్డి విమర్శించారు.




బాలకృష్ణ నటవారసుడుగా మోక్షజ్ఞ తారకరామతేజను తెరపై చూడాలని అభిమానులు కొన్నేళ్ళ నుంచీ ఎదురుచూస్తున్నారు. వారి అభిలాష ఈ యేడాది ఆరంభంలో నెరవేరుతుందని భావించారు. అప్పట్లో 'హనుమాన్' దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో మోక్షజ్ఞ హీరోగా ఓ సినిమా పట్టాలెక్కాల్సి ఉంది. చివరి నిమిషంలో ఆ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయింది. ఇప్పుడు నందమూరి కళ్యాణ్ రామ్ తన 'బింబిసార'తో దర్శకునిగా పరిచయం చేసిన వశిష్ఠ డైరెక్షన్ లో మోక్షజ్ఞ సినిమా అని ప్రకటించారు. చిరంజీవి హీరోగా 'విశ్వంభర' చిత్రాన్ని తెరకెక్కించారు వశిష్ఠ. ఆ సినిమా విడుదల కావలసి ఉంది. ఈ నేపథ్యంలోనే బాలయ్య తనయుడు మోక్షు హీరోగా వశిష్ఠ డైరెక్షన్ లో సినిమా అని ప్రకటన వెలువడడం విశేషంగా మారింది. ఈ చిత్రంలో మోక్షజ్ఞ సరసన శ్రీలీల నాయికగా నటిస్తోందని వినికిడి. బాలయ్యతో శ్రీలీల నటించిన 'భగవంత్ కేసరి' ఘనవిజయం సాధించింది. అందువల్ల మోక్షుతో శ్రీలీల జోడీ కూడా ఆకట్టుకుంటుందని ఫ్యాన్స్ ఆనందిస్తున్నారు. మోక్షజ్ఞ సరసన శ్రీలీల నటిస్తుందన్న విషయంపై ఇప్పటి దాకా ఏ క్లారిటీ లేదు. దర్శకుడు వశిష్ఠ కానీ, ఈ చిత్రాన్ని నిర్మిస్తోన్న మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు కానీ హీరోయిన్ ఎవరో ప్రకటించలేదు. అయితే మోక్షు జోడీగా శ్రీలీల నటిస్తే బాగుంటుందని కొందరు ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. తండ్రి బాలకృష్ణతో శ్రీలీల కూతురులాంటి పాత్రలో నటించిన భగవంత్ కేసరి' ఘనవిజయం సాధించింది. ఆ కోణంలో చూస్తే బాలయ్య నటవారసుడు మోక్షుకు కూడా శ్రీలీల పాదం అచ్చివస్తుందని అభిమానుల అభిప్రాయం. ఇదిలా ఉంటే తెలుగు చిత్రాల్లో శ్రీలీల ట్రాక్ రికార్డ్ అంత గొప్పగా లేదు. 'భగవంత్ కేసరి'తో పాటు రవితేజతో నటించిన 'ధమాకా', అల్లు అర్జున్ సరసన చిందేసిన 'పుష్ప–2' చిత్రాలు మాత్రమే బంపర్ హిట్స్ సాధించాయి. మిగిలినవన్నీ ఏ మాత్రం మురిపించలేక పోయాయి. అందువల్ల కొందరు శ్రీలీల లెగ్ పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హీరోలుగా తెరంగేట్రం చేసిన కొత్తవారితో శ్రీలీల నటించింది. ఆ రెండూ కన్నడ చిత్రాలే కావడం గమనార్హం. శ్రీలీల తొలిసారి నాయికగా కనిపించిన చిత్రం 'కిస్' – ఆ సినిమా హీరో విరాట్ కు కూడా అదే మొదటి చిత్రం. శతదినోత్సవం చూసింది. తరువాత కిరీటి రెడ్డి హీరోగా పరిచయమైన 'జూనియర్'లోనూ శ్రీలీలనే నాయిక. ఈ సినిమా ఆకట్టుకోలేక పోయింది. అందువల్ల మోక్షు జోడీగా శ్రీలీల నటిస్తే అంతగా రక్తి కట్టదు అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. పైగా ఇప్పటికే పవన్ కళ్యాణ్, మహేశ్ బాబు, అల్లు అర్జున్ వంటి సీనియర్స్ తో చిందేసిన శ్రీలీల మోక్షు జోడీగా కనిపించినా మురిపించలేదనీ కొందరు చెబుతున్నారు. ఇలా మోక్షు తొలి సినిమాలో శ్రీలీల నటిస్తే బాగుంటుందని కొందరు, అంతగా ఒప్పదని మరికొందరు భావిస్తున్నారు. నవంబర్ లో మొదలు కానున్న మోక్షజ్ఞ సినిమాలో ఎవరు హీరోయిన్ గా ఎన్నికవుతారో చూడాలి.




యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య హీరోగా, 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మోస్ట్ అవేటెడ్ మిస్టీరియస్ మైథలాజికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' . శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బాపినీడు సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. మైథాలజీ, మిస్టరీ, అడ్వెంచర్ అంశాల మేళవింపుతో ఇప్పటివరకు భారతీయ తెరపై ఎవరూ టచ్ చేయని ఒక సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని భారీ స్కేల్‌లో తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్లు, స్ట్రైకింగ్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. ఈ క్రమంలో మేకర్స్ తాజాగా 'వృషకర్మ' ప్రపంచవ్యాప్త థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను అధికారికంగా లాక్ చేస్తూ అల్ట్రా స్టైలిష్ పోస్టర్‌ను వదిలారు. ఈ మైథికల్ స్పెక్టాకిల్ 4 డిసెంబర్, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే, ఈ విడుదల తేదీ వెనుక టాలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన చర్చ మొదలైంది. నిజానికి పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ – హను రాఘవపూడి కాంబోలో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రాన్ని డిసెంబర్ మొదటి వారంలో (డిసెంబర్ 3న) విడుదల చేయాలని భావించారు. కానీ అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి కాకపోవడం, భారీ వీఎఫ్ఎక్స్ పనుల కారణంగా 'ఫౌజీ' ఆ డేట్ నుంచి తప్పుకుని వాయిదా పడినట్లు ఫిలింనగర్ వర్గాల్లో గట్టి ప్రచారం సాగింది. ఇప్పుడు ఆ క్రేజీ డేట్‌ను క్యాష్ చేసుకునేందుకు ఇతర హీరోలు లైన్‌లోకి వస్తుండగా.. ముందుగా నాగచైతన్య తన సినిమాను సరిగ్గా డిసెంబర్ 4న దించుతూ పోస్టర్ రిలీజ్ చేయడంతో 'ఫౌజీ' వాయిదా ఖరారైనట్లేనని ఇండస్ట్రీ వర్గాలు ఒక అంచనాకు వచ్చేస్తున్నాయి. 'వృషకర్మ' కోసం విడుదల చేసిన తాజా పోస్టర్ సినీ ప్రియులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. షార్ప్ కట్ హెయిర్‌స్టైల్, గుబురు గడ్డం, వీపున బ్యాగ్‌తో పాటు చేతిలో పవిత్రమైన వింత ఆయుధాన్ని ధరించి చైతూ కనిపిస్తున్న తీరు ఇంటెన్స్‌గా ఉంది. ఈ సినిమా కోసం నాగచైతన్య పూర్తి సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా, 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం, రాగుల్ డి. హెరియన్ సినిమాటోగ్రఫీ, శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ పనుల్లో ఉన్న ఈ చిత్రానికి ప్రమోషన్స్ కోసం కావాల్సినంత సమయం దొరకడంతో, పాన్ ఇండియా రేంజ్‌లో భారీ ఎత్తున ప్రమోషన్స్ నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. సో.. డిసెంబర్ బరిలో చైతూ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తారో తెలియాలంటే మాత్రం డిసెంబర్ 4 వరకు వెయిట్ చేయాల్సిందే.




కేజీఎఫ్, సలార్ ఫేమ్ ప్రశాంత్ నీల్ సమర్పణలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న హారర్ థ్రిల్లర్ '418'. కీర్తన్ నందగౌడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సూర్య రాజ్ , చరణ్ లక్కరాజు, ప్రీతీ పగడాల కీలక పాత్రల్లో నటించారు. అయితే ఇప్పటికే విడుదల కావాల్సిన ఈ చిత్రం అనూహ్యంగా వాయిదా పడింది. సినిమాలో హర్రర్ సన్నివేశాల విషయంలో సెన్సార్ బోర్డ్ తీవ్ర అభ్యంతరాలు పెట్టడంతో మేకర్స్ మూవీ, ట్రైలర్, రిలీజ్ అన్నింటినీ వాయిదా వేసుకోక తప్పలేదు. అయితే.. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికేట్ ఇచ్చి ప్రేక్షకులను హెచ్చరించింది. అలానే ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాతో ఒక నెవర్ బిఫోర్ హారర్ థ్రిల్లర్ ని నీల్, మైత్రి సంస్థ తీసుకువస్తున్నట్లుగా సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మరి '418' ఏ మేరకు ప్రేక్షకులను థ్రిల్ చేస్తుందో చూడాలి!

Cinema




సామాజిక సేవలోనూ తమదైన ముద్ర వేస్తూ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ మరోసారి ప్రశంసలు అందుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వస్థ్ నారీ వికసిత్ భారత్' కార్యక్రమానికి మద్దతుగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, సర్వైకల్ క్యాన్సర్ నివారణపై దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 8 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 820 పాఠశాలలు, కమ్యూనిటీల్లో ప్రత్యేక అవేర్‌నెస్ ఈవెంట్లు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, అండమాన్–నికోబార్ దీవుల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా సుమారు 3 లక్షల మంది బాలికలు, యువతులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం యువతల్లో చైతన్యం పెంచాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా అల్లు అర్జున్ అభిమానులు ఒకే వేదికపైకి రావడం విశేషం. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో ముందుండే ఈ భారీ అవగాహన యజ్ఞం ద్వారా అభిమాన సంఘాలు కూడా సామాజిక మార్పుకు వేదిక కావచ్చని నిరూపించింది. అంతేగాక హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, సర్వైకల్ క్యాన్సర్ నివారణపై సరైన సమాచారం ప్రతి బాలికకు చేరాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం ప్రస్తుతం అనేక వర్గాల ప్రశంసలు అందుకుంటోంది. అభిమానుల సమష్టి కృషితో సాధించిన ఈ ఘనత, సామాజిక బాధ్యత పట్ల AAFA నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది.




యన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'డ్రాగన్' మూవీ రెండడుగులు ముందుకేస్తే నాలుగడుగులు వెనక్కి సాగుతున్నట్టుగా ఉంది. అన్నీ అనుకున్నట్టు జరిగి ఉంటే 'డ్రాగన్' మూవీ ఈ యేడాది జనం ముందుకు రావాలి. అయితే మధ్యలో కొన్ని అనివార్య కారణాల వల్ల 'డ్రాగన్' షూటింగ్ ముందుకు సాగలేదు. ఈ మధ్య యన్టీఆర్ భుజానికి ఆపరేషన్ జరిగింది. ఈ కారణంగా కూడా షూటింగ్ లో జాప్యం చోటు చేసుకుంది. ఇలా ఏదో ఒక కారణంగా 'డ్రాగన్' షూటింగ్ అనుకున్న తీరున సాగడం లేదు. మళ్ళీ యన్టీఆర్ 'డ్రాగన్' చిత్రీకరణలో పాలుపంచుకుంటున్నారని తెలియగానే అభిమానుల ఆనందం అంబరమంటుతోంది. ఏమైనా 'డ్రాగన్' ఈ యేడాది వెలుగు చూడడం లేదు. అందువల్ల మళ్ళీ జూనియర్ కెరీర్ లో గ్యాప్ పడిందనే చెప్పాలి. అయితే ఈ గ్యాప్ – సక్సెస్ రూటుకు దారితీసేదే అని ఫ్యాన్స్ భావిస్తున్నారు. యన్టీఆర్ సోలో హీరోగా ఎంట్రీ ఇచ్చింది మొదలు 2001 నుండి 2008 వరకు ప్రతి యేటా సినిమాలను రిలీజ్ చేస్తూనే వచ్చారు. అయితే 2008లో 'కంత్రి' సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. దాంతో సరైన సబ్జెక్ట్ కోసం ఎదురుచూశారు. ఆ సమయంలో కొంత గ్యాప్ తీసుకోవలసి వచ్చింది. తరువాత 2010 లో సంక్రాంతికి 'అదుర్స్'తో భలేగా అలరించారు యన్టీఆర్. ఆ సినిమాలో యన్టీఆర్ పంచిన వినోదాన్ని అభిమానులు ఎప్పటికీ మరచిపోలేరు. అదే యేడాది దసరా కానుకగా వచ్చిన యన్టీఆర్ మూవీ 'బృందావనం' సైతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. 2009లో యన్టీఆర్ సినిమా రిలీజ్ కాకపోయినా, మరుసటి సంవత్సరం ఫ్యాన్స్ కు డబుల్ ధమాకా అందించారు. ఆ తరువాత 2018 వరకు మళ్ళీ గ్యాప్ లేకుండా ప్రతి యేటా కనీసం ఓ సినిమానైనా జనం ముందు నిలుపుతూ వచ్చారు.

# డ్రోన్ కంటికి చిక్కిన ప్రాణం!

**దట్టమైన అడవిలో రెండు రోజులు.. లోయలో చిక్కుకున్న వ్యక్తికి పోలీసుల రక్షణ**



సమయం ప్రతినిధి మహబూబ్నగర్ : దట్టమైన అడవి.. చుట్టూ కొండలు.. లోతైన లోయలు.. ఎక్కడున్నాడో తెలియని పరిస్థితి.. రెండు రోజులుగా కుటుంబ సభ్యుల్లో ఆందోళన. చివరకు పోలీసుల డ్రోన్ కెమెరా కంటికి చిక్కాడు. కొండ చరియల మధ్య ప్రాణాలతో పోరాడుతున్న వ్యక్తిని గుర్తించిన పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

కోయిలకొండ మండలం ఆచార్యపూర్ గ్రామానికి చెందిన జాజలి కృష్ణయ్య ఈ నెల 8న ఉదయం మేకలను మేపేందుకు గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో 9వ తేదీ రాత్రి కోయిలకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**డ్రోన్‌తో ముమ్మర గాలింపు**

విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ డి.జానకి వెంటనే స్పందించి కృష్ణయ్య ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. దట్టమైన అడవి, కొండలు, లోయల కారణంగా సాధారణ గాలింపుతో ఆచూకీ కనుగొనడం కష్టంగా మారడంతో డ్రోన్ కెమెరాలను రంగంలోకి దించారు. గాలింపు సమయంలో కొండ ప్రాంతంలో అనుమానాస్పద కదలికను గుర్తించిన డ్రోన్ కెమెరా.. చివరకు కృష్ణయ్యను గుర్తించింది. మేకలను మేపుతూ కొండపైకి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి లోయలో చిక్కుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

**నీళ్లతోనే రెండు రోజులు..**

కొండ చరియల మధ్య చిక్కుకున్న కృష్ణయ్య రెండు రోజుల పాటు తన వెంట తీసుకెళ్లిన నీటిని తాగుతూ ప్రాణాలు కాపాడుకున్నాడు. డ్రోన్ ద్వారా అతని ఆచూకీ నిర్ధారించుకున్న పోలీసులు వెంటనే ప్రత్యేక బృందాలతో అక్కడికి చేరుకున్నారు. ప్రమాదకరమైన కొండ ప్రాంతంలో జాగ్రత్తగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి కృష్ణయ్యను బయటకు తీసుకొచ్చారు.

**ఎస్పీ అభినందనలు**

ఆపదలో ఉన్న వ్యక్తిని సకాలంలో గుర్తించి సురక్షితంగా రక్షించిన ప్రత్యేక పోలీసు బృందాలు, ఏఆర్ స్పెషల్ పార్టీ సిబ్బంది, డ్రోన్ నిర్వాహకులను జిల్లా ఎస్పీ డి.జానకి అభినందించారు. పోలీసుల చొరవతో తమ కుటుంబ సభ్యుడు క్షేమంగా తిరిగి రావడంతో కృష్ణయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యతగా పేర్కొంటూ.. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు చివరి వరకు శ్రమిస్తారని ఎస్పీ తెలిపారు.

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085